# కనువిప్పు

బండారి రాజకుమార్



కలల దీపాల్ని ఆర్పేసుకుని
కనులు వాటంతటవే మూసుకుంటయి
కలల్ని మండించాలను కుంటవు
ఆలోచనల రెక్కల్ని తెగనరికి
రేపటి ఉపద్రవానికి బలి త్తవు
గల్మట్ల  అడుగు పెట్టినప్పుడే జిట్టి దీసి బూడిది గుమ్మడి  కాయను
నాలుగు బజాట్ల కాడ పచ్చలు పచ్చలు జేసుంటవు
మంచి జేత్తె..నరకాన్ని బొట్టు పెట్టి పిలిశి
దంటగూడినట్టుంటది యవ్వారం!
నీకిప్పటికీ లోకం పోకడ వంటబట్టినట్టు లేదు సుమా
పరగడుపునే లేశి మొసపోసుకుంట ఉరి కొత్తవు
మోసం ఎట్లజేత్తరో డెమో సూపియ్యమని కాళ్ల వేళ్లా పడి  బతిలాడుతవు
నీయంత ఎర్రిబాగులోడు ఎవడూ లేడని
మా యింటి కుక్క తోకూపి సైగజేత్తది!!
నువ్వెందుకింకా
వీరత్వాన్ని ఉరితాడు లోనే జూసుకుని మురుత్తవు?
కాలం చెల్లిన కవిత్వాన్ని మసి పెంక మీద అటూ ఇటూ మర్రేశి
ఎంత మంది ఆకలి తీర్చాలను కుంటానవు?
మనసు విప్పి మాట్లాడు
నా కళ్లలోకి సూటిగా చూసి చెప్పు?
ఇది కపట నాటకమైతే కాదు కదా!
బుగ్గలు బుగ్గలు ఏగిన జొన్నిత్తులు
నీకేమైనా సందేశం మోసుకొచ్చినయంటవా?
షెకతాకక మిగిలిన బొడిగెల్నిజూసి
గట్ల బీరిపోయి సూత్తానవేంది?
పందెం మధ్యలో పరుగు ఆపమని
ఆకాశవాణి పలికిందా?
మోసం చేయడం అంటే ఇదే మిత్రమా...
ఇకనైనా కళ్లు తెరుస్తావు కదూ..!

★★★



## కవిధే(య)నునాదం
## సందిత

సునిశితమై , సున్నితమై
ఇతరులవెతల్ని వెతకివెతికి
వెలికితీయటంలలో లీనమై
కుతకుతమంటూ
సతాయిస్తున్నా
తన వెతలస్మృతిలో మాత్రం..
స్పందనలో మృతమై!
కృతకస్మితాధరాలతో
మేథఃపయోధరాలతో
కవితామృతధారాపాతాలిస్తున్న
మర్త్యముఖధేనువులున్నాయ్ !
పొదుగులనిండా పాలుంటాయ్
యెదల్లో స్వార్థాలుండవ్
అమ్ముకోవ్
మనసుల్నే మాటల్నే నమ్ముకుంటాయ్
అమ్ముకోవ్ !
తలుగులు గుదిబండల్లేని
బహిరంగాశ్రయాలకై తపిస్తాయ్
వండివడ్డించాల్లిన పన్లేదు
గడ్డనపడే బయలు పచ్చనైయుంటే చాలు!!
అరుస్తున్నాయ్
అర్రులుచాస్తున్నాయ్
మీరిచ్చే ఆస్తులో శాలువలో
పుచ్చుకునేందుకు కాదు!!
పొదుగుల్లో ఊరుతున్న పాలిచ్చేందుకై!!
మనసుల్లో పొంగుతున్న
సద్భావాల్ని పంచిచ్చేందుకై!!

***

## కుదురు
## కేతిరెడ్డి యాకూబ్ రెడ్డి

ఎంత ఎదిగితేనేం!
ఆకాశ హర్మ్యాల్లో ఉంటేనేం!!
మబ్బుల్లో చేదవేసి నీళ్ళు తోడలేం
కాంక్రీట్ భవనంపై విత్తూ నాటలేం.
మబ్బు మట్టిని సంగమిస్తేనే నీళ్లు.
విత్తును మట్టి పెనవేస్తేనే చెట్టు.
కుండీలోనైనా సరే
మట్టి కుదురు ఉంటేనే చెట్టు ఎదుగుదల!
మనిషికి ఎప్పుడు అర్థమౌతుందో -
ప్రేమ కుదురు లేకుంటే మానవత్వం బ్రతకదని!!

★★★

## మౌనం
## శిరీష జస్వాల్

మౌనం అంటే నాకు
చాలా ఇష్టం సుమీ!
మనసు పడ్డ
నీ మాటలస్వరాలన్ని
ఎన్నో స్వరాగ కీర్తనలుగా
హృదయనాదం లో
వింటూ ఉండొచ్చు !
కొండ లోయలోంచి
చల్లగా వీచే గాలిలా
వచ్చిపోయే నీ చిరునవ్వును
అలానే ఆస్వాదిస్తూ ఉండిపోవచ్చు!!
శాంతంలో స్వచ్ఛమైన కోనేరులా,
కోపంలో మండే కర్పూరం మాదిరి ,
మారే నీ హావభావాలను
నా కనులకపాటి లో బంధిస్తున్న
ప్రతిసారి వేవేల అమృతతరంగిణి - నిండిపోయే నా మనసులో..

★★★

# అవ్వ

గోపీకృష్ణ శాఖాపూర్

అవ్వ నీవ్వు సలంగా వుండల్నే
పురిటి నొప్పులతో వున్న మాయమ్మకు పురుడు పోస్తివి!
పున్నమిలో పుట్టినందుకు పున్నమి అని పేరు పెడితివి!
వెక్కి వెక్కి ఏడుస్తుంటే
ఏడువకు ఏడువకు నా బుజ్జితల్లి అంటూ బుజ్జగిస్తివి!
ఆయీ అయితే అపురావున ఊరికి ఆకుమందు తెస్తివి!
మనవరాలు బుట్టిందని మందికల్ల మల్ల మల్ల జేప్తివి!
ఉయ్యాల దినాన ఊరు మొత్తానికి యాట కూర వొండిపెడితివి!
అడగకముందే అంగడికి పోయి ఆడుకునేందుకు
అందమైన ఆటబొమ్మ తెస్తివి!
బొడ్రాయి యెనుకన్ననా కల్లు దుకాణం కాడికెళ్లి
కొంగునా కట్టుకొని గుగ్గిలు తెస్తివి!
పొలిమేర కాడా వున్నా పోచమ్మ గద్దెకి
మొక్కడనికి పొద్దు పొద్దునే తీసుకపోతివి!
చెరువు గట్టు గుండా సెనుకాడికి పోతుంటే
శెంగు శెంగున ఎగురుతున్న చాపపిల్లల్ని జూపితివి!
ఓలిసేను ఓంపు మీద ఓడ్లు యెట్లా తిస్తారో తుర్పుబట్టి సూపితియి!
తాటికల్లు తాగి పడిపోయిన తాతను
తన్నుకుంటా తొలుకొచ్చి నా కాళ్ళ కాడ పండవెడితివి!

అవ్వ నేను నినెట్ల యాది మరుస్తనే
అవ్వ నీవ్వు సలంగావుండల్నే!!!

★★★

# రసరేఖలు

శ్రీధర్ బచ్చోటి

ఏవో లోకాలనుండి యేవేవో కలలు
ఒకటి యొకదానివెనుకనింకొకటి వచ్చు
కనులపై వాలుచుండును కదలుచుండు
ఎల్లలెరుగని ముదమునందించుచుండు

దూరమందున్న నెచ్చెలి చేరవచ్చు
పొందజాలని ప్రేమ నా పొందు కోరు
కలతలన్నియు కలలోన కన్నుమరగు
చేతికందని స్వర్గమ్ము చెంత నిలచు

కనులముందరెపుడు నిలచినది లేదు
తనివితీరగ నిన్ను చూచినది లేదు
కాని నాతోడనుందువు కలలలోన
వాస్తవమ్ముగ తోచు స్వప్నమ్ములన్ని

పయనమౌదుము రోదసీపథములోన
చేరగలము గ్రహాంతర సీమలెన్నొ
అద్భుతమ్మైనదీ మధురానుభవము
స్వప్నమైనను మదినిండు సత్యమట్లు

జరుగనేరని ఘటనలు జరుగుచుండు
కలుగనేరని స్థితిగతుల్ కలుగుచుండు
క్షణము తోచును జీవితకాలమట్లు
అన్యమెరుగని నిశ్చలధ్యానమట్లు



చిత్రం:కె.రామ్మోహన్

COMMENTS